పెద్ద కథ

....“ బొమ్మ...బొరుసు ”

(‘Matter of Life and Death’ అనే ఇంగ్లీషు చిత్రము చూసిన తర్వాత కలిగిన భావాలతో వ్రాసిన రచన యీ బొమ్మ—బొరుసు కథ. సంపాదకురాలు.)

ఎన్నో మెట్లు ఎక్కి చివరకి పైమెట్టుమీదికి వచ్చాను. వెనక్కి తిరిగి చూస్తే ఒక్క మెట్టు కన్పించలేదు. నాకు అంతా ఏదో కలలాగ వుంది. ఎక్కడనుంచి వచ్చినది, ఎక్కడ ఉన్నదీ ఏమీ పాలు పోలేదు.

ఆ పరిసరాల్లో అంతటా చాలా చల్లగా హాయిగా వుంది. దూరాన మంచు శిఖరాలు కరిగి సెలయేళ్లుగా మెల్లి మెల్లిగా పారుతున్నై. ఓ మూలనుంచి అతి మధురమైన గానము వినవస్తూంది. మరొక వైపున ఓ సరస్సులో రెండు హంసలు మెల్లిగా యీదుకుంటూ పోతున్నై.

ఓ స్త్రీ రూపం...ఓ పురుషాకృతి...జంటలుగా,—చాలా జంటలు ఆ ప్రదేశమంతటా విహరిస్తున్నారు.

ఇంతలో ఓ పురుషాకృతి నా సమీపంగా వచ్చి నవ్వుతూ నిలబడింది....మరుక్షణంలో నేను ఆ పురుషాకృతి వెనువెంటనే బయలుదేరాను. త్రోవలో చాలా జంటలు మమ్మల్ని చిరునగవులతో పలకరిస్తూ పోతున్నారు.

నేను, ఆ పురుషాకృతి వెళ్లి, వెళ్లి ఓ సరస్సు ఒడ్డున కూర్చున్నాము. ఆ పురుషాకృతి చెప్పింది...“నా కర్మ పరిపక్వము అయి ఎంతో సుకృతం చేసుకున్న ఫలితంగా నేను యీ ఊర్ధ్వ లోకాన్ని పొందాను, అంతా సంతోషమేగాని, విచారమన్న మాట వుండదు,”—

ఆ తరువాత ఆ పురుషాకృతి అంది,—“అదిగో చూడు నీ పూర్వ చరిత్ర ఏలాంటిదో, నువ్వు యిక్కడకు ఎలా వచ్చావో.”

...మొట్టమొదట ఆ సరోవరంలో మా ప్రతిబింబాలు కన్పించినై. తరువాత రెండడుగుల వలయాకారంలో నీళ్లు పోయి దట్టంగా పొగమంచు కన్పడింది. మెల్లి మెల్లిగా ఆ మంచు విడిపోయి ఒక కంత ఏర్పడింది. అందులోంచి చూస్తే లెఖ్ఖపెట్ట లేనన్ని చలువరాతి మెట్లు కన్పించినై. మరుక్షణంలో ఆ మెట్లు మసక మసకగా అయిపోయి అన్నీ కింద స్పష్టంగా కనుపించడం మొదలు పెట్టాయి.

అదిగో జ్ఞాపకం వుంది.

మావూరే. అదిగో ముప్పనవారి సిల్కు మిల్లు, భారతం వారి డేరా సినిమా; అమ్మణ్ణి మూడంతస్థుల మేడ...

అప్పుడే కలెక్టరు కచ్చేరిలో రెండు గంటలు కొట్టారు. రోడ్డుమీద ‘నాన్ రొట్టి బిస్కట్’ వాడు కేకలు వేసుకుంటూ ఖాతా ప్రకారం మా యింటికి వచ్చి రొట్టెలు యిచ్చి వెళ్లాడు. మా అమ్మ ఎండపొడలో కూర్చొని. సుమతి శతకం చదువుతూన్నాను. ఇంతట్లో కాళ్ల మట్టెల చప్పుడు మాపిన్ని వస్తూన్నట్టు తెలియ చేసింది. “మీనా, బజారుకు వెళ్లి నాల్గు వందలు మల్లెపూలు పట్రా అమ్మా, యీ పావలా తీసుకొని వెళ్లి,” అంటూ పురమాయించింది మా పిన్ని. రాళ్లు ఏరడం మాని మా అమ్మ పిన్నికేసి తల యెత్తి చూసింది. మా పిన్ని అమ్మకేసి చూడనే లేదు. లేచి వెళ్లపోతుంటే, “బాగా చేరమాడి పుచ్చుపూలు లేకుండా ఏరి పట్రా,” అంటూ హెచ్చరించింది మాపిన్ని.

మండువా, శోభనాల గది, కచ్చేరి సావడి, నడవా, వరండాదాటి, వీధి గుమ్మం దగ్గరకు వచ్చేటప్పటికి వీధి

శ్రీ శ్రీహరిరావు

గదిలో కూర్చొని, జాగ్రఫీ కంఠతాపడుతున్న మా అన్న, "ఎక్కడికి యీ ఎండలో?" అన్నట్టు ప్రశ్నార్థకంగా చూశాడు. "మల్లెపూలకి, రమణకు జడ కుట్టుందిట పిన్ని," అంటూ మెట్లుదిగా. ఇంటికి బజారుకు మైలు ఉంటుంది. పావలా గుప్పెట్లో గట్టిగా పట్టుకొని ఆలోచిస్తూ వెడుతున్నాను. కాళ్లు మండుతున్నై. కాస్త దూరంలో మర్రి చెట్టు నీడ. అక్కడకు వచ్చాక ప్రాణం లేచివచ్చింది. మళ్లీ చాలా దూరం ఎండ. తరువాత అయ్యరు హోటలు నీడ. బాగుంది.—ఎండ...నీడ...ఏమిటీ వీట్ల వింత కలయిక! నీడ అంటూ వుంటేగాని ఎండ రౌద్రము తెలీదు కాబోలు! "ఎండ...నీడ" చాలా గమ్మత్తుగా వుంది. పూలఅమ్మి కసిరికొట్టింది, "యింతటి పావలా బేరానికి పుచ్చులు, చచ్చులు, ఏరవచ్చిందయ్యా యీ గుంట," అంటూను...

పూలు తీసుకొని మళ్లీ ఆలోచిస్తూ యింటికి వస్తూన్నా. ఎంత ఆలోచించినా అర్థంకాదు. నేను, మా అన్న, మా అమ్మ, ఎందుకు మనస్సుల్లో తీవ్రబాధ అనుభవిస్తున్న దీని నా చిన్న మెదట్లో ఏమీ సమాధానం దొరకలేదు.

మాపిన్ని రోజూ సాయంత్రం అయిదు గంటలకి వీధి అరుగుమీద సభ తీర్చుతుంది.

ఆ సభకి ఆమె అధ్యక్షురాలు. ఇరుగు పొరుగు ఆ సభకి హాజరు అవుతారు. ఆ సభలో అనేక విషయాల చర్చలు, తీర్మానాలు జరిగి పోతుంటై. దీపాలు పెట్టగానే సభ చాలించి ఎవరి యిళ్లకు వాళ్లు వెళ్లిపోతారు. అధ్యక్షురాలి కాలిమట్టెలు లోపలికి వస్తాయి.

నాకు జ్ఞానం రాక పూర్వము మా సంసారపు సంగతులన్నీ యీ సభలద్వారా నాకు తెలిసినై. — ..."మా నాన్నగారు ప్లీడరీ పని చేసి చాలాడబ్బు, మంచిపేరు. గడించారని, ఆ రోజుల్లో మా అమ్మ బంధుకోటిని ఎంతో ఆదరణగా చూస్తూ, "మా సీతమ్మ, ఆ సీతా దేవేనమ్మా;" అంటూ నల్గుర్లోను కీర్తి తెచ్చుకుందని, అయితేనేం, మా అమ్మకి, (మా పిన్నిలాగే) గడుసుదనం, దాపరికం లేక సంసారం చితికి పోయిందని, నల్గురు కూతుళ్ల పెళ్లిళ్లు పురుళ్లు పుణ్యాలు, చేసేటప్పటికే సంసారం డీలా అయిపోయిందని, ఉన్నట్టు ఉండి మమ్మల్ని బీదవాళ్లగా చేసి మా నాన్నగారు పోయారని, అప్పణ్ణుంచీ మా మేనమామ మమ్మల్ని పోషిస్తూన్నాడని".........................అంటూను.

మా అమ్మ మామూలుగా వంట చేస్తూంది. మా పిన్ని సభకు పోయింది. నేను మా అమ్మకు చేరువలోనే వసార్లో కూర్చున్నాను. పైన రెండు రామ చిలుకలు పండబారిన కాయల్ని కొట్టూ పైపొట్టు నా మీద పడేస్తున్నాయి. మా దొడ్డి గోడ అవతల బోగంది (పుష్పారత్నం) హార్మోనియం శృతి వేసుకొని "ఓరోరీ, సరసుడా" అంటూ ఆరంభించింది. గొల్ల అప్పడు, బొబ్బిలి పాటలు పాడుకుంటూ ఆవులకి కుడితి పెట్టూన్నాడు. తులశమ్మ అరుగుమీద— నేను తెచ్చిన మల్లెపూల వాలుజడ...నీలం పట్టుపరికిణీ, ఎర్ర టపేటా గౌనుతో మాపిన్ని మనమరాలు రమణ, నాలాంటి వేషంతోనే మా అక్క మంగళ, గచ్చకాయలు ఆడుకుంటున్నారు...

గచ్చకాయల ఆట ఆపి రమణదగ్గరున్న అణాకాసుతో, "బొమ్మ...బొరుసు"...ఆట మొదలు పెట్టారు. మా అక్క తల్లో కూడ చిన్న మల్లెపూల దండ ఉంది పేరుకి.

రమణ, "బొమ్మ" అంటూంది; మా అక్క "బొరుసు", అంటూంది. ఎంతసేపు చూసినా "నాదేబొమ్మ", అంటూ రమణ కేరింతాలు కొట్టూంది. అయినా మా అక్క ఏమీ చిన్న పుచ్చుకోలేదు. అలాగే ఆడ్తూన్నారు.

ఆలోచించాను. నాకు మా అక్కకి ఎంత తేడా మనస్సుల్లో...మా యిద్దరికి దేంట్లోను పోలిక లేదు. అది దేనికి కాతరు పెట్టదు. ఒకళ్లు అంటే ఆవగింజ అంతయినా లెఖ్ఖ పెట్టదు. దేనికీ మనస్సులో బాధ పడదు. అసలు దానికి మనసు అంటూ లేదేమోననే నా అనుమానం. మా అక్కకి అబ్బో! చాలా కోరికలు ఉన్నై. తర్చు మాఅమ్మని వేపించుకొని తినేది. అందరిదగ్గర నెత్తిబద్దలు కొట్టి తెచ్చుకొనే శక్తి చాళా ఉండేది. ఒకరు ఏమైనా అనుకుంటారేమో అనే భయము ఎక్కడా వుండేది కాదు. మా యిద్దరికి ఎంత తేడా! —నేను, "మల్లెపూల దండ, (చిన్నది!) పెట్తాను రావే," అని మా పిన్ని పిల్చినా

పెట్టించుకోలేదు. నాకు తెలుసు—. నన్నూ మా అక్కని చిన్నతనం పర్వాలనే మా పిన్ని పూలు పెట్టానంటుంది. మా అక్కకి నాలాంటి పిచ్చిఊహాలు ఉండేవి కావు.

మా అమ్మ పులుసులోకి పోపు వేయిస్తూంది. పోపు వాసన చాలా కమ్మగా ఉంది. ఓ పక్కనుంచి రమణ తల్లీ మల్లె పూల వాసన, వెనకాల తోట అవతల బోగంవాళ్ల దొడ్లోంచి సంపెంగపూల వాసన బాగా వేస్తూన్నాయి. పోపు వాసన బాగుందా? పూల వాసన ఇంపుగా వుందా? అన్నది చెప్పడం కష్టం.

ఇంకా బొమ్మబొరుసు ఆట అవనేలేదు. "ఇంక చాలిద్దూ,...బొరుసు ఆట, నువ్వూన్నూ," అంటూ మా అమ్మ కేకలేసింది మా అక్కని వాళ్లిద్దరు లెఖ్ఖ చెయ్యకుండానే యింకా, 'బొమ్మ...బొరుసు' అంటూ ఆడ్తూనే వున్నారు.

మా అమ్మ విసుక్కుంది; "బొమ్మ బొరుసూ," అనుకుంటూ. ఎందుకు మా అమ్మకి బొమ్మ...బొరుసు, అంటే అంత కష్టం.? నాకు తెలీలా. ఇంతట్లో, మా పిన్ని వాళ్ల సభ చాలించి లోపలికి వస్తున్నట్లు దూరాన్నించే మట్టెల చప్పుళ్లు చెప్పాయి.

మళ్లీ క్షణంలో, 'బొమ్మ...బొరుసు' పోయి మండువాలో దీపం కిందికి 'పార్కి' వారి ఆంధ్ర వాచకాలు చేతికి వచ్చాయి రమణకి, మా అక్కకీని.

రాత్రి పడుకొని ఆలోచిస్తూంటే సమాధానం దొరికింది—అవును.—మా పిన్ని తనకున్న భాగ్యం చూచుకొని మురుస్తుంది, అధికారం చలాయిస్తుంది. తన సొంత అక్క అయినా మా అమ్మని పైవాళ్ల ఎదుట ఎంతో అలుసుగా చూసి మా అమ్మ పొందిన బాధచూసి సంతోషిస్తుంది. మా అమ్మ పూర్వం ఎంత వైభవంగా వుంటేనేం.? అహం. తెలిసింది. మా పిన్ని "బొమ్మ." మా అమ్మ 'బొరుసు'! అందుకే మా అమ్మకి, "బొమ్మ...బొరుసు" అంటే అంతకించ. నాకు అనిపించింది—ఆసాళంగా లేచి వెళ్లి మా అక్కని, రమణని లేపి ఆచెంప, యీచెంప వాయిద్దామని—వాళ్ళ ఆటలే మా అమ్మని బాధపెట్టినందుకు.

ఇట్టే నాలో నాకే నవ్వువచ్చింది—'ఛా! వాళ్ల మొహం! వాళ్ల ఆట సరదా వాళ్ల కేగాని, వాళ్ల కేంతెలుసు? యింకోళ్ల కి కష్టం కల్గిస్తున్నామని." నేనుకనుక ఆలోచించి సమన్వయించుకొని అర్థం కల్పించుకున్నాను గాని"—అని.

ఒక్కొక్కప్పుడు అనుకునేదాన్ని—"నాకు ఎందుకు ఇన్ని ఆలోచనలు, ఊహాలు, బాధ పడటం. చక్కగా, రమణలాగ నవ్వుకుంటూ, కేరుకుంటూ ఎందుకు హాయిగా వుండకూడదు అని. మర్నాటినుంచి నాతీరు నాదే.

రమణ, మా అక్క, సుశీల, కమల, అంతా నవ్వుకుంటూ గోల చేసుకుంటూ బడికి వెళ్లేవాళ్లు. నేనుమటుకు మా పినతండ్రిగారి వెనకాలే ఏదో ఆలోచించుకుంటూ వెళ్లేదాన్ని.

అంటే అంతచిన్న వయస్సులోనే నాకు మానసిక పరిపక్వము వచ్చేసింది. మంచికో చెడ్డకో! యిలాంటి ఆలోచనలతోటే తెల్లవారిపొయ్యేది.—మళ్లీ సాయంత్రం కాగానే క్రిందటిరోజు సంగతులే, "బొమ్మ...బొరుసు—ఇలా రెండేళ్లు గడిచాయి.

తరువాత మా అన్న కాలేజీ చదువుకు రాజమండ్రి వచ్చేసాం. నాకు, మా అన్నకు ముఖ్యంగా, మా అమ్మకు ప్రాణాలు తెరిపిని పడినాయి. ఏదో వనవాసములోంచి బయటకు వచ్చినట్లు అనిపించింది. అయితే, మా అక్కకి మాత్రం ఏమీ తేడా కన్పించినట్లు తోచదు! దాని స్వభావానికి సరిపడ్డ పరిస్థితుల్ని అది అప్పుడే కల్పించుకుంది. రోజులు నెమ్మదిగా సాఫీగా జరుగుతున్నై. నేను, మా అక్క సదనములో చదువుకు చేరాము. మా అమ్మ అంటే యిరుగు పొరుగు ఎంతో ఆదరణ, అభిమానం చూపించేవారు.

సదనంలో మాస్టర్లు అంతా నేను అంటే ఎంతో ఆపేక్ష పడేవారు. ఒక్క సంస్కృతములో తప్పిస్తే మిగత వాట్లో అన్నిట్లోను నాకే మొదటి మార్కులు వచ్చేవి. మా అక్క చదువులో ఎప్పుడూ వెనకే. వాళ్ల క్లాసు మాస్టర్లు మా

అక్కయ్యని కోప్పడేవారు,—"మీ చెల్లెల్ని చూడు, ఎంత బాగా చదువుతుందో, నువ్వు మటుకు ఒఠ్ఠి......" అంటూను. అది మటుకు ఎప్పుడైనా దేనికైనా కాతరు చేస్తేనా!

ఇలావుండగా మా అక్కకి ఎదురు మేనరికం యిచ్చి పెళ్లిచేశారు. కొన్నాళ్లు అవగానే మా బావ తీసుకొని వెళ్లిపోయాడు. అది వెడుతుంటే నాకు బావురుమని ఏడ్పు వచ్చింది, మా అమ్మకు మల్లేనే! కాని—మా అక్కకి ఏమీ మనస్సులో చలనం కన్పించలేదు—చాలా ఆశ్చర్యమయిన విషయము!

రోజులు సరిగ్గా వెడితే యింకేం కావాలి! మా అమ్మకి ఉన్నట్టుండి చాలా జబ్బుచేసింది. రోజుకురోజు గడవడం చాలా దుర్భరమయ్యేది. డాక్టరుగారు ఎంతో మంచిఆయన దొరికారు. చాలా శ్రద్ధగా మందు యిచ్చేవారు. మా పరిస్థితికి ఎంతో జాలిచూపేవారు. అయితే—రోజూ వచ్చి చూసి వెళ్లేటప్పుడు మాత్రం, "అమ్మాయీ జట్కాకి ఆరు అణాలు యియ్యి అమ్మా," అని తీసుకొని వెళ్లేవారు. ఆయనకు తెలుసు మేము ఎంత లేనిస్థితిలో వున్నది, యిరుగు పొరుగు దగ్గర బదులు తెచ్చి యిసున్నాన్న సంగతీని. అయినా ఆయన తీసుకొనేవారు! అప్పుడు ఆయనలో మానవత్వం మాయమయ్యేదేమో!

ఈ రోజుల్లో తరుచు ఎరిగినవాళ్లదగ్గరకి చేబదుళ్లకు వెళ్లవలసి వచ్చేది. ఎంతరక్తం పంచుకున్న చుట్టాలయినా, మా అమ్మచేత లెఖ్ఖలేనన్ని సార్లు మనిషి సహాయం పొందిన వాళ్లైనా, అవసరం వచ్చినప్పుడు—వెధవ ఒకటి రెండు రూపాయలు బదులు యివ్వడానికి ఎంతో క్రుంగిపొయ్యేవారు. "మీబావ యింకా క్యాంపునించి రాలేదే, మీనా!"—అంటూను. అక్కడకి రెండు రూపాయల్లో ప్రాణాలు కాస్తా గుటుక్కుమనేట్టు.

ఎంతో నిస్సహాయ స్థితిలో ఉండి, అడగలేక, అడిగే వాళ్లకి ఎంత దగ్గర బంధువులు అయినా బదులు యివ్వరు, యివ్వలేరు. చక్కగా వూసుపోక కబుర్లు పదివాగి, ఉబ్బేసి, పూర్తిగా ఎగకొట్టేవాళ్లకి ఎంత సంతోషంతో యిస్తారు—వేలకువేలు అప్పులు. ఇది ముమ్మాటికి సత్యం—ఏమీ అంటే, యిదొక ఆచారము, పరిపాటిన్నీ.

మా అమ్మకు జబ్బుగావున్న యీ యిరవై రోజులు, మేము ఉన్నయిల్లు రోజూ కిటకిటలాడి పొయ్యేది. మా శాఖవాళ్లు అంతా, మా అమ్మకి ఎలావుందో అని చూచిపోడానికి వచ్చేవారు.

పెద్ద చిక్కువచ్చి పడ్డది. డాక్టగారు మా అమ్మని ఎక్కువ మాట్లాడించవద్దు అంటే, యీ వచ్చిన అమ్మలక్కలు అందరూ మా అమ్మచేత ఒక ముక్కకి పది ముక్కలు మాట్లాడిస్తేనే కాని తృప్తి పొందేవారు కారు. వీళ్లందరికీ పెద్ద భయం పట్టుకుంది.—కడసారి పిల్ల, దీనికి పెళ్లి అవకుండానే, మా అమ్మకు యింత జబ్బు చేసిందే—అని.! వీళ్ల యీ మాటల్తోటి మా అమ్మకు ఎక్కువ అయ్యేది.

అనుకునేదాన్ని—'యివాళ ఎవర్నీ చూడ్డానికి రానియ్య కూడదు' అని. అయితే సాయంత్రం పురాణం వేళకి అందరూ తయారు. నేను ఏమీ చెయ్యలేక పొయ్యేదాన్ని. అవును—'ఓ వ్యక్తి ఆ దర్శాలు, అభిప్రాయాలు, ఎంత ఉన్నతమైనవైనా సంఘానికి ఉండే శక్తి ముందు. ఏపాటి!

ఎలాగైతేనేం కొన్నాళ్లకి మా అమ్మకి బాగా తగ్గిపోయింది.

(సశేషము)